ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 15.04.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదను ప్రపంచానికి పరిచయం చేస్తూ పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.

2. 2029 ఎన్నికల నాటికి చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పానికి అన్ని పార్టీలు మద్దతు తెలపాలని ఎంపీ డీకే అరుణ కోరారు.

3. నియోజకవర్గాల పునర్విభజన -డిలిమిటేషన్ ప్రక్రియ ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే సహించేది లేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు అన్నారు.

4. రాష్ట్రంలో రాబోయే ఐదు రోజుల పాటు ఎండల తీవ్రత పెరగనుందని, పలు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో హెచ్చరిక జారీ చేసింది.

------------------------------

**జూపల్లి-హైదరాబాద్**

రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలను, వారసత్వ సంపదను ప్రపంచానికి పరిచయం చేస్తూ పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలో పరిధిలోని సెవెన్ టూంబ్స్, కటోరా హౌస్, కేబీ మ్యూజియం

ప్రాంతాలను కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌తో కలిసి మంత్రి ఈ ఉదయం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కుతుబ్ షాహీ టూంబ్స్ లో పెండింగ్ పనులను వారంలోగా ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కుతుబ్ షాహీ టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు ప్రతిపాదించిన రోప్‌వే ప్రాజెక్టుకు సంబంధించి అనుమతులు రాగానే డీపీఆర్ సిద్ధం చేయాలని సూచించారు. కటోరా హౌస్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, గోల్కొండ సమీపంలో లాడ్ బజార్ తరహా షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**(డెస్క్)**

---------------------------------

**నారీ శక్తి వందన్-డీకే అరుణ**

నారీ శక్తి వందన్ అభియాన్ బిల్లుకు మద్దతుగా మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ నేతృత్వంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో భారీ మహిళా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, 2029 ఎన్నికల నాటికి చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పానికి అన్ని పార్టీలు మద్దతు తెలపాలని కోరారు. మహిళలు రాజకీయాల్లో కీలక పాత్ర పోషించినప్పుడే వారి రక్షణ, అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**( బైట్ - ఎంపీ డీకే అరుణ )**

**(పీటీసీ - మహబూబ్ నగర్)**

----------------------------

కేటీఆర్

నియోజకవర్గాల పునర్విభజన -డిలిమిటేషన్ ప్రక్రియ ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే సహించేది లేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు అన్నారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా డిలిమిటేషన్ జరిగితే, అది కేవలం ఒక రాజకీయ ప్రక్రియగా మిగిలిపోదని, మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి

దారితీస్తుందని స్పష్టం చేశారు. జనాభా నియంత్రణ పాటిస్తూ, అభివృద్ధిలో దూసుకుపోతున్న దక్షిణ రాష్ట్రాల పార్లమెంటు ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ఈ విషయంలో తమ పార్టీ మూడేళ్లుగా ఒకే వైఖరితో ఉందన్నారు. దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రాతినిధ్యాన్ని అణచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని ప్రకటించారు ఇప్పటికైనా ఢిల్లీ పాలకులు విజ్ఞతతో వ్యవహరించాలని అన్నారు.

**(డెస్క్)**

----------------------------

డీజీపీ-కామారెడ్డి

రోడ్డు ప్రమాదాల నివారణ అనేది కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, అది సమాజం మొత్తం కలిసి చేపట్టాల్సిన ఉద్యమమని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు. కామారెడ్డి పట్టణంలోని కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన 'Arrive Alive -Road Safety' కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. నిర్లక్ష్యం కారణంగానే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు గ్రామ స్థాయి నుంచి అవగాహన పెరగాలని సూచించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాద బాధితులను రక్షించిన వంకాయల రవిని సన్మానించారు.

**(పీటీసీ, కామారెడ్డి)**

--------------------------------

ఆసిఫాబాద్ సర్వే

ఆసిఫాబాద్ జిల్లాలో ఆదిమ గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పీఎం జన్ మన్' పథకం సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి అధికారులను ఆదేశించారు. ఆసిఫాబాద్‌లోని శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సర్వేను విజయవంతం చేయాలని సూచించారు.

**(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)**

---------------------------

వరంగల్-అరైవ్ అలైవ్

'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా ఉర్స్ రంగాలీల మైదానం కూడలి వద్ద పాఠశాల విద్యార్థులతో భారీ మానవహారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఈ కార్యక్రమంలో పాల్గొని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిస్తూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

**(పీటీసీ, వరంగల్)**

------------------------------------

హన్మకొండ-పోషణ్ పక్వాడ

హన్మకొండ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 15 రోజుల పాటు 'పోషణ్ పక్వాడ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. పెద్దమ్మగడ్డ కేంద్రంలో పోషక విలువలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు అంగన్‌వాడీ టీచర్ మాధవి ఆకాశవాణితో తెలిపారు.

**(బైట్ - మాధవి అంగన్వాడీ టీచర్)**

**(పీటీసీ - వరంగల్ )**

------------------------------

**కరీంనగర్-సర్పంచ్**

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ దూలం కళ్యాణ్ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు తన సొంత ఖర్చులతో కూలీలకు చల్లటి తాగునీరు, ఉచిత రవాణా, ఎండ తీవ్రతను తట్టుకోవడానికి నిత్యం రాగి జావా అందజేస్తున్నారు. ఎండలో పనిచేసే కూలీలు నీరసించిపోకుండా ఉండటానికే ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ ఆకాశవాణితో చెప్పారు.

**(బైట్ - సర్పంచ్ ధూలం కళ్యాణ్)**

**(పీటీసీ, కరీంనగర్)**

----------------------------

నల్లగొండ ధాన్యం-కలెక్టర్

నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం అన్లోడ్ విషయంలో మిల్లర్లు రైతులకు ఎలాంటి ఇబ్బందులు సృష్టించకుండా త్వరితగతిన కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**(పీటీసీ, నల్లగొండ)**

---------------------------

జనగామ-అరైవ్ అలైవ్

జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత ర్యాలీలో సి.ఐ సత్యనారాయణ రెడ్డి పాల్గొని, మైనర్లు వాహనాలు నడిపితే వారిపైనే కాకుండా తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, హెల్మెట్ , సీటు బెల్ట్ ప్రాధాన్యతను వివరిస్తూ రోడ్డు నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

**(పీటీసీ, జనగామ)**

------------------------------

**సిరిసిల్ల-ఆర్టీసీ**

ఆర్టీసీ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు రాజన్న సిరిసిల్ల డిపో కార్మిక సంఘాలు నిరవధిక సమ్మెకు సిద్ధమయ్యాయి. ఈ రోజు డిపో ఎదుట నిర్వహించిన నిరసనలో భాగంగా, కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, యూనియన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

**(పీటీసీ, సిరిసిల్ల)**

----------------------------

**ఎనుమాముల**

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో తేజ రకం మిర్చికి ఈ సీజన్‌లోనే రికార్డు స్థాయి ధర లభించింది. వరుస సెలవుల తర్వాత మార్కెట్ పునఃప్రారంభం కావడంతో

వ్యాపారుల పోటీ మధ్య క్వింటాల్ మిర్చి గరిష్టంగా 21 వేల100 రూపాయల ధర పలికింది. గత గరిష్ట ధర కంటే ఏకంగా వెయ్యి రూపాయలు అదనంగా లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**(పీటీసీ, వరంగల్)**

-----------------------

సిరిసిల్ల పంట నష్టం

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు మండలాల్లో ఇటీవలి అకాల వర్షాల వల్ల 850 ఎకరాల్లో వరి, మామిడి పంటలకు నష్టం వాటిల్లిందని జిల్లా వ్యవసాయ అధికారిణి అఫ్జల్ బేగం తెలిపారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించిన అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు పంపారని వెల్లడించారు.

**(పీటీసీ, సిరిసిల్ల)**

--------------------------

సిరిసిల్ల-కలెక్టర్

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రేపు నిర్వహించే మండల, మున్సిపల్ స్థాయి సభలను విజయవంతం చేయాలని సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ అధికారులను ఆదేశించారు. ఈ సభల ద్వారా ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు.

**(పీటీసీ, సిరిసిల్ల)**

------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో రాబోయే ఐదు రోజుల పాటు ఎండల తీవ్రత పెరగనుందని, పలు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో హెచ్చరిక జారీ చేసింది.  ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని

తెలిపింది. చాలా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం నెలకొంటుందని, ప్రజలు వాతావరణ మార్పులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

**(డెస్క్)**

-------------------------------

ఆసిఫాబాద్-నకిలీ విత్తనాలు

ఆసిఫాబాద్ జిల్లాలో నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ నితిక పంత్, వ్యవసాయ అధికారి వెంకటి హెచ్చరించారు. నిషేధిత గ్లైసిల్ విత్తనాల వల్ల ఆరోగ్యం, భూసారం దెబ్బతింటాయని.. వీటి అమ్మకాలపై నిఘా ఉంచేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

**(పీటీసీ, ఆసిఫాబాద్)**

-----------------------------

ఆసిఫాబాద్-ఉపాధిహామీ

ఆసిఫాబాద్ జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కే.హరిత అధికారులను ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్ట్యా పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.

**(పీటీసీ, ఆసిఫాబాద్)**

-------------------------------------